క్లుప్తంగా

జోగింపేట మద్యం షాపు తనిఖీ



మద్యం సీసాల నిల్వలను పరిశీలిస్తున్న జేసీ ఎస్ఎస్ శోభిక

సీతానగరం: మండలంలోని జోగింపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం అమలు చేసిన నూత మద్యం పాలసీలో భాగంగా కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమైన విషయం విదితమే. అందులో భాగంగా జోగింపేట మద్యం దుకాణాన్ని ఆమె సందర్శించి జాబితా ప్రకారం ఉండాల్సిన సరుకు ఉన్నదీ లేనిదీ ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాల్లో ఉండాల్సిన వన్నీ విధిగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మద్యాన్ని విక్రయించాలని దుకాణ యాజమాన్యాలకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ప్రసన్నకుమార్, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్ సింహాచలం, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే విజయ్ చంద్ర



శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురంటౌన్: పల్లెల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయం అని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో పల్లె పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అడ్డాపుశీల నుంచి పిన్నింటి రామినాయుడువలస గ్రామం వరకు రెండు కిలోమీటర్ల పొడవున రూ.75 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఏ గ్రామంలో ఏ పనులు అవసరమో వాటిని పూర్తి చేసేందుకు తగిన నిధులు విడుదల చేసినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతంపై ఏపీవో అసంతృప్తి

వీరఘట్టం: మండలంలోని గంగంపేట ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు బుధవారం సందర్శించారు. అక్కడి తరగతుల నిర్వహణతో పాటు పాఠశాల పరిసరాలు, రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులు తక్కువ మంది తరగతులకు హాజరు కావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. దసరా సెలవులు ముగిసినా పిల్లలు ఇంకా పాఠశాలకు రాలేదా అని ప్రశ్నించారు. వారు రాకపోతే వారు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్టోర్ రూమ్ పరిశీలించి, ఆహార నిల్వలు తనిఖీ చేసి, పిల్లలకు నాణ్యమైన విద్య, ఆహారం అందివ్వాలని సూచించారు.

పకడ్బందీగా అపార్ ఎన్‌రోల్‌మెంట్

గుమ్మలక్ష్మీపురం: జాతీయ విద్యా విధానం -2020 అమలులో భాగంగా మొదటి విడతగా 9, 10వ తరగతుల విద్యార్థులకు జారీ చేయనున్న అపార్ కార్డుల కోసం ఎన్‌రోల్‌మెంట్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి జి. పగడాలమ్మ అన్నారు. బుధవారం ఆమె మండలంలో పర్యటించారు. ముందుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాలు, తాగునీరు, బడి తోట, మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. ఐదు, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి విద్యా సామర్థ్యాలపై ఆరా తీశారు. అనంతరం నాడు - నేడు పథకం పనులు ప్రారంభమై అర్ధంతరంగా నిలిచిపోయిన పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ భవనాలకు సంబంధించిన సూపర్‌వైజర్లతో ఎంఆర్సీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాల వైపు పిల్లలెవ్వరూ వెళ్లకుండా రెడ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. పాఠశాలల్లో బడి తోటలు అభివృద్ధి చేయాలని, అపార్ ఎన్‌రోల్‌మెంట్‌లో తప్పుల్లేకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... పార్వతీపురం మన్యం జిల్లాలో 9, 10 తరగతుల విద్యార్థులు 22,500 మంది ఉండగా ఇప్పటివరకు 14 శాతం అపార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తయిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బడి తోటల సాగుకు సంబంధించి జిల్లాలోని 1283 పాఠశాలలకు కూరగాయలు, ఆకు కూరల విత్తనాలు సరఫరా చేసినట్లు చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించేందుకు మండల స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈమె వెంట ఎంఈఓ బి.చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూఓ బి.సురేష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

తీవ్ర వర్షాభావం



చుక్క నీరయినా లేని చెరువు



నీరులేని నారన్నాయుడువలస వద్ద ఉన్న తోటపల్లి పిల్లకాలువ



గుమ్ములలో ఉన్న నీటిని ఇంజిన్‌తో తోడుకుంటున్న రైతులు

- చుక్కనీరు లేని పెదంకలాం, తోటపల్లి, నాగావళి ఏటిబట్టి చానల్స్
- ఎండిపోయిన చెరువులు
- గుమ్ములలో ఉన్న నీటిని తోడుకుంటున్న రైతులు
- పాడైపోతున్న పంటపొలాలు

బలిజిపేట: తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతుండడంతో వరిపంటకు తీవ్రనష్టం వాటిల్లుతోందని మండల రైతులు రోదిస్తున్నారు. నెల రోజులకు పైగా వర్షం కురవకపోవడంతో చేతికి అందివచ్చే పంట నష్టపోవాల్సి వస్తుం దేమోనని ఆందోళన చెందుతున్నారు. సాగునీటి వనరులు ఇంకిపోయి కనిపిస్తున్నాయి. పెదంకలాం కాలువ, తోటపల్లి పిల్లకాలువ, నాగావళి ఏటిబట్టి చానల్‌తో పాటు చెరువుల్లో చుక్కనీరు కనిపించకపోవడంతో పంటకు నష్టం వాటిల్లే ఆస్కారం ఉందంటూ రైతులు లబోదిబో అంటున్నారు. వర్షాలు కురవకపోగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంటపొలాలు బీడు బారుతున్నాయని లబోదిబోమంటున్నారు. వెన్ను వచ్చే సమయంలో ఈ విధంగా వరుణుడు కరుణించకపోవడంతో ఏంచేయాలో తోచడం లేదని వాపోతున్నారు. మెదలు, వర్షాధార భూములలో పంట ఎండకు ఎండి మలమలమాడి పోతోందని చెబుతున్నారు. ముఖ్యంగా మెదలు వేసే రైతులు నష్టపోవాల్సి వస్తుందని అంటున్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలుతో చేతికి డబ్బు అందేదని దాంతో కొంతవరకు ఖర్చులు గడిచేవని, ఇప్పుడు పంటనష్టపోయి, సంక్షేమ పథకాలు అందుబాటులో లేకపోతే సన్నకారు, చిన్నకారు రైతులు, నిరుపేదల జీవన పరిస్థితులు ఏమిటనేది ప్రశ్నార్థకంగా ఉందంటూ రోదిస్తున్నారు. మండలంలో ఖరీఫ్‌లో వరిసాగు 18,609ఎకరాలు కాగా దానిలో కాలువలు, చెరువులు, బోర్ల దిగువన సాగు 15,000ఎకరాలు. మిగిలింది పూర్తి వర్షాధారం.

సరైన వర్షాలతో ఉబాలు పూర్తి

ప్రస్తుతం కాలువలు, చెరువుల్లో నీరు లేకపోవడంతో బోర్లు మినహా మిగిలిన పంటకు నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని రైతులు చెబుతున్నారు. ఆగస్టులో సాధారణ వర్షపాతం 195.9ఎంఎం కాగా కురిసింది 199ఎంఎం, సెప్టెంబరులో సాధారణ వర్షపాతం 196.1ఎంఎం కాగా కురిసిన వర్షపాతం 186.8ఎంఎం, అక్టోబరులో సాధారణ వర్షపాతం 150ఎంఎం కాగా ఇప్పటికి కురిసింది 5.1ఎంఎం వర్షపాతం మాత్రమే. గడిచిన రెండు నెలల్లో వర్షాలు సరైన సమయంలో పడడంతో ఉబాలు సక్రమంగా నిర్వహించి పంటపై ఆశ పెంచుకున్నామంటున్నారు.

వరుణుడు కరుణ లేకపోతే అంతే..

వరుణుడు కరుణించి వర్షాలు కురిస్తేనే పంట చేతికి వస్తుంది. ఇంతవరకు అంతా సజావుగా సాగినా ఇప్పుడు తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యాయి. చెరువుల్లో నీరులేదు. పంటలు ఎండిపోతున్నాయి. ఒకపక్క తెగుళ్ళు ఉన్నాయి. ఇది రైతుకు కష్టకాలం.

– సత్యంనాయుడు, రైతు, పలగర



సాగునీరు లేని పెదంకలాం కాలువ



ఎండిపోతున్న వరిపంట

రైతుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ

పార్వతీపురంటౌన్: వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం స్థానిక సుందరయ్య భవనంలో మన్యం జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో రైతు అంతరిక్ష స్థాయిలో ఉన్నాడని రాజకీయ నాయకులు, తెర వెనుకున్న హీరోలు చెబుతున్న బూటకపు మాటలు పచ్చి అబద్ధమని, రైతుల కష్టాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయన్నారు. అన్ని పథకాలకు గ్యారెంటీ ఇస్తున్న ప్రభుత్వాలు రైతుకు, పంటకు మాత్రం గ్యారెంటీ ఇవ్వలేకపోతున్నాయని, ఇది చాలా దుర్మార్గమని వాపోయారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మినాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గేదెల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.రాము, రెడ్డి రమణమూర్తి, రెడ్డి ఈశ్వరరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

దోమపోటు, తెగులుపై రైతులకు సూచనలు



నారాయణపురంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు

బలిజిపేట: దోమపోటు, తెగులుపై రైతులు ఎటువంటి మందులను వినియోగించాలి? ఎటువంటి జాగ్రత్తలు చేపట్టాలనే దానిపై ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు తగుసూచనలు అందించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురం, పెద్దింపేట గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంటపొలాలను పరిశీలించి కాటుక తెగులు, మెడవిరుపు తెగులును పరిశీలించారు. వాటి నివారణకు తగు సూచనలు ఇచ్చారు. అదే విధంగా దోమపోటు నివారణకు పిచిఎసిఫేట్ 1.5గ్రాము లేదా ఇథోఫెన్‌ప్రాక్స్ 2.0ఎంఎల్ లేదా ఇమిడాక్లోప్రిడ్, ఎథిప్రోల్ 0.25ఎంల్, లేదా ట్రీఫ్లుమేజాఫైరిం 0.5ఎంఎల్ లేదా పైమెట్రోజిన్ 0.5గ్రాము లేదా డైనోటిఫ్యూరాన్ 0.4గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వెటర్నరీ శాఖా పరంగా రైతుల పశువులకు సంబంధించిన సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎం.పెదపాపినాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు త్వరగా పూర్తిచేయాలి



టెంకాయ కొడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: గ్రామాల్లో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీ త్రివిక్రమరావు తెలిపారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని బగ్గందొరవలసలో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో సర్పంచ్ ఎ.నారాయణరావుతో కలిసి ఇంకుడు గుంతల నిర్మాణానికి ఆయన టెంకాయ కొట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రెండు ఇంకుడు గుంతల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయని వాటిని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఒక దానికి రూ.54వేలు వంతున మంజూరయ్యాయని తెలిపారు. వర్షపునీరు ఇంకడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నీటిని వృథా చేయకుండా ఉపయోగపడుతుందని చెప్పారు. నిర్దేశించిన గడువునాటికి ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ భాను, ఏఈ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ అనుమానిత కేసులపై అప్రమత్తం

- జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ



సుభద్రలో రికార్డులు పరిశీలిస్తున్న సూర్యనారాయణ

బలిజిపేట: మలేరియా, డెంగీ అనుమానిత కేసులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ సూచించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అరసాడ పీహెచ్‌సీ, సుభద్ర ఉపకేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శశిధర్‌ను అక్కడి పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సుభద్రలో సబ్ సెంటరును పర్యవేక్షించి గ్రామాల్లో మలేరియా, డెంగీ అనుమానిత కేసులు ఉంటే వెంటనే ఉన్నత ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయాలని స్పష్టం చేశారు. డ్రైడేను పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించి కచ్చితంగా పాటించాలని చెప్పారు. దీనివల్ల దోమల లార్వాను ఎప్పటికప్పుడు నిర్మూలించవచ్చని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు

సాలూరు:

పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ రమణ తెలిపారు. 'ఇలా పట్టుకున్నారు'..'అలా వదిలేశారు' శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ కోరగా, ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోవడం వాస్తవమేనని, ఈ ట్రాక్టర్‌లోని ఇసుక అన్నా క్యాంటీన్ నిర్మాణానికి చేరవేసినట్లు తెలిసిందన్నారు. దీనిపై ఉన్నతాదికారులతో మాట్లాడి కేసు నమోదుచేస్తామని స్పష్టం చేశారు.

దివంగత సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని సంగంవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్ బడే చిట్టి నాయుడు కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ అంతిమయాత్రలో పాల్గొని చిట్టినాయుడు పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బంది ఖాళీలకు 54దరఖాస్తులు



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: కేజీబీవీలో బోధనేతర సిబ్బంది ఉద్యోగ నియామకాలకు సంబంధించి 54దరఖాస్తులు వచ్చినట్లు ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు బలిజిపేట ఎంఆర్సీలో దరఖాస్తులను ఆయన గురువారం పరిశీలించారు. చౌకీదార్, హెడ్ కుక్, అసిస్టెంట్‌కుక్ ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉండగా చౌకీదార్ పోస్టుకు 13మంది, అసిస్టెంట్ కుక్‌కు 18, హెడ్‌కుక్‌కు 23మంది మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తుల తుది పరిశీలన పూర్తిచేయనున్నట్లు చెప్పారు. వాటిని ఎంపిక ప్రక్రియ నిమిత్తం డీఈఓ కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సమస్య

పార్వతీపురంటౌన్:

పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఎటూ చూసినా వాహనాల రద్దీనే కనిపిస్తోంది. ఉదయం పూట స్కూళ్లు, కళాశాల సమయాల్లో సమస్య ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. పనిమీద బయటకు వచ్చిన వాహనదారులు తమ వాహనాన్ని ఎక్కడ పార్క్ చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. పార్వతీపురం ప్రధాన రహదారికి ఇరుపక్కలా ఎటుచూసినా దుకాణాల ఎదుట వరుసగా ద్విచక్ర వాహనాలు బారులు తీరి కనిపిస్తుంటాయి.

ఎక్కడ చూసినా వాహనాలే..

జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణం వ్యాపార, వాణిజ్య రంగాలకు కేంద్రంగా ఉంది. రోజూ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వ్యాపారులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై పాదచారులు వెళ్లడానికి కూడా వీలులేని రీతిలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అయితే ప్రధాన రహదారుల్లో ఎక్కడా పార్కింగ్ వ్యవస్థ లేదు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి మొదలు సౌందర్య జంక్షన్ పాతబస్టాండ్ నుంచి పద్మశ్రీ వరకూ ప్రధాన రహదారి పొడవునా ఎటూ చూసినా వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేదు. రోడ్డుపైనే వాహనాలు నిలిపివేయాల్సి వస్తుండడంతో రాకపోకలు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో పాటు ప్రధాన రోడ్డు లోనే తోపుడుబండ్లు, ఆటోలను ఇష్టారాజ్యంగా నిలిపివేస్తుండడంతో సమస్య జటిలంగా మారుతోంది.



సౌందర్య జంక్షన్ సమీపంలో ఓ హాస్పిటల్ వద్ద వాహనాలు



మోర్ షాపింగ్ మాల్ వద్ద వాహనాలు

నిబంధనలకు విరుద్ధంగా..

పట్టణంలోని ప్రధాన రహదారిలో దుకాణదారులు, హోటళ్లు ఇతర దుకాణదారులు షాపు ఎదుట మార్జిన్ స్థలాన్ని వదలివేయకుండా కాల్వలు దాటి రోడ్డు ముందు వరకూ మెట్లు, అరుగులు వేసుకోవడంతో పార్కింగ్‌కు స్థలం లేకుండా పోయింది. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వీరంతా నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకపోవడమే సమస్యకు ప్రధాన కారణమైంది. ప్రజలు తమ వాహనాలను ఆయా దుకాణాల ఎదుటే నిలిపాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై దృష్టి సారించి ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పార్కింగ్ వ్యవస్థను మెరుగుపర్చాల్సి ఉంది. ఉన్న వసతులతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా ఎక్కడపడితే అక్కడ వాహలు నిలిపివేయకుండా సహకరించాలి. ప్రధాన రహదారి ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవు.

– సన్యాసిరావు, ఇన్‌చార్జి, కమిషనర్

ఆ ఫర్నిచర్ ఏమైంది....?

- మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో మాయం



ఫర్నిచర్ మాయమైన పారిశుద్ధ్యవిభాగం గది



ఫర్నిచర్ మాయంపై కమిషనర్‌ను అడుగుతున్న సీపీఎం నాయకుడు ఎన్‌వైనాయుడు

సాలూరు: మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య విభాగానికి చెందిన గదిలో సుమారు లక్ష రుపాయల విలువ మాయమైంది. దీనిపై సంబంధిత కార్మికులు, కార్మిక నేతలు ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.అయినప్పటికీ నేటికీ అధికారుల నుంచి స్పందన కరువైంది. దీనిపై విచారణకు ఆదేశించి నిజాలు నిగ్గుతేల్చే దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ గదిలో ఉన్న ఫర్నిచర్ బాధ్యతను సదరు విభాగాధిపతే వహించాల్సి ఉంటుంది.అయితే ఆ అధికారిని కాపాడే ప్రయత్నంలో భాగంగానే మున్సిపల్ అధికారులు మౌనం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.మున్సిపల్ కాంప్లెక్స్‌లో షాపు నంబర్ 20 అద్దె చెల్లింపు వ్యవహారంపై,తాజాగా ఈ ఫర్నిచర్ మాయం అంశాలపై మున్సిపల్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై పురప్రజలు విస్తుపోతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపాలిటీలో పాలన పడకేసినట్లు మారిందని అధికారుల తీరుపై పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారుల తీరు ఇలానే ఉంటే జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదుచేయాల్సి ఉంటుందని పలువురు ప్రజాప్రతినిధులు,నాయకులు మాట్లాడుకుంటున్నారు.

పారిశుద్ధ్యవిభాగానికి చెందిన గదిలో ఫర్నిచర్ మాయంపై కమిషనర్‌సత్యనారాయణను వివరణ కోరగా, ఆ విభాగంలో ఫర్నిచర్ మాయమైనట్లు తెలిసిందన్నారు.కాగా దీనిపై ఇంత వరకు లిఖితపూర్వకంగా ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంపై విచారణకు ఆదేశించలేదని ఆయన సమాధానం ఇవ్వడం విశేషం. ఫర్నిచర్ మాయంపై విచారణ జరిపించాలని అధికారులకు ఫిర్యాదు చేశామని, విచారణ ఎప్పుడు చేపడతారని కమిషనర్‌ను బుధవారం ప్రశ్నించినట్లు సీపీఎం నాయకుడు ఎన్‌వై నాయుడు తెలిపారు.